క్లుప్తంగా

కొండలమ్మకు మొక్కుబడుల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి భక్తులు పాల పొంగళ్లను, మొక్కుబడులను సమర్పించారు. భక్తులుతీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మదర్స్ డే



గుడివాడ టౌన్: పట్టణంలో మదర్స్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రైలుపేటలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి ఆధ్వర్యంలో తల్లులను ఘనంగా సత్కరించారు. ప్రతి తల్లి తన బిడ్డల సంరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు సమాజంలో తల్లి పాత్రను ఆదర్శంగా చూపా లని పాస్టర్ రత్నబాబు అన్నారు. ఆర్‌కే యూత్ ఆధ్వర్యంలో బేతవోలు శాంతి వృద్ధాశ్రమంలో తల్లులను ఘనంగా సత్కరించారు. వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి గౌర వించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌర వించడం మన బాధ్యత అని రామకృష్ణ (ఆర్ కే) అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మీరా షరీఫ్, నూనె అయ్యప్ప, దివిలి సురేష్, గంట అంజి, పందెళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వందలాది మంది రోగులకు గుడివాడ వైద్యురాలు డాక్టర్ గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. లయన్స్ చైర్మన్ శింగంశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యపై అవగాహన పెంచుకోవాలి



మండవల్లి: విద్యార్థులు ఉన్నత విద్యపై అవగాహన పెంచుకోవాలని కాంపిటేటివ్ ఎగ్జామ్ ట్రైనర్ మేడిశెట్టి కల్యాణ్ అన్నారు. మండలంలోని భైరవపట్నం ఓ ఫంక్షన్ హాల్‌లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలపై కైకలూరు రాయల్ క్లబ్, స్థానిక సుధామ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ అభిరుచి, ప్రతిభ, నైపుణ్యాలకు పదును పెట్టాలన్నారు. సుదాబత్తుల విజయ్ కుమార్, రామిశెట్టి విజయ్‌కుమార్, హైస్కూల్ హెచ్‌ఎంలు జి.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వరరావు, కీర్తి రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

పామర్రు: పోలీసుల వేధింపులు తట్టుకోలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన పామర్రులో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..పామర్రుకు చెందిన పువ్వాడ మణికంఠ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనేపథ్యంలో పామర్రుకు చెందిన పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లు తరచూ వేధిస్తున్నారు. వారి వేధింపులు తాళలేక పురుగుల మందు తాగాల్సి వచ్చిందని విలేకరుల సమావేశంలో తెలిపాడు. ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై పామర్రు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ జరిపి, ఉన్నతాధికారులకు నివేదించి, వారి సూచన మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

దివ్య సత్రసాద పండుగ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పరాసుపేట ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం దివ్య సత్రసాద పండుగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ లాం జయరాజు, అసిస్టెంట్ ఫాదర్ రవికుమార్ పర్యవేక్షణలో ఈ మహోత్సవం జరిగింది. నగరంతో పాటు పలు గ్రామాలకు చెందిన క్రైస్తవులు, బాలబాలికలు పాల్గొని దివ్య సత్రసాదాన్ని స్వీకరించారు. బాలబాలికలు దివ్య బలిపూజ సమర్పించారు. ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు, ఏఐసీసీ సభ్యుడు మువ్వల యోహాన్ పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం

అవనిగడ్డ: స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత పఠనం, తెలుగు పద్యాలను నేర్పించారు. ఆధ్యాత్మిక గురువు మత్తి శేషగిరిరావు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎ. వీరకుమారి విద్యార్థులకు కథలు చెప్పడం, భగవద్గీత శ్లోకాలు, పుస్తక పఠనం, డ్యాన్స్ నేర్పించారు. గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



అన్న సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే సమాజం సుభిక్షంగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే గోత్ర నామాలతో పూజాధికాలను నిర్వహించారు. తదుపరి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మట్టా పూర్ణచంద్రరరావు, మండలి డైరెక్టర్లు డీడీ ప్రసాద్, కుందేటి రాణి తదితరులు ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు. స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

5 వేల మందికి అన్న సమారాధన

ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. జీర్ణావస్థలో ఉన్న ఆలయాలను గుర్తించి వాటికి తగు విధమైన సహాయాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ టీ శ్రీనివాసరావు, డైరెక్టర్ వెంకటరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఎల్. సత్యవతి, ఆలయ ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు, కమిటీ సభ్యులు వేలాదిగా భక్తులు, ఆలయ సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని పలు గ్రామల్లో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారి రుద్రవరం, భైరవపట్నం, లోకుమూడి, చావలిపాడు తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. మండవల్లి సెంటర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయం, రైల్వే గేట్ వద్దగల ఆంజనేయస్వామి ఆలయం, హైస్కూల్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం, స్టేషన్‌రోడ్ సెంటర్‌లో గల ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద స్వామివారికి ఘనంగా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పామర్రు: హనుమత్ జయంతి వేడుకలను వాడవాడలా ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ మేనేజర్ కందుల వెంకట రెడ్డి పర్యవేక్షించారు. మండలంలోని జమీదగ్గుమిల్లి గ్రామంతో శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ఆలయంలో విశేషంగా పూజలను నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కాకర్ల సీతారామాంజనేయదాసు, శీతాల శ్రీనివాసరావు, ఉమ్మడిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు. రాపర్ల గ్రామంలో వీరాంజనేయస్వామి ఆలయంలో జయంతి సందర్భంగా ఆలయంలో పంచామృతాలతో, నవరసాలతో విశేషంగా అభిషేకాలను చేసి స్వామిని విశేషంగా అలంకరించి శత సహస్రమాలతో పూజలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ కమిటీసభ్యులు కాకర్ల ప్రభాకరరావు, తుంగల అంజిబాబులు పాల్గొన్నారు. గణ్యశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వీరాంజనేయస్వామికి విశేషంగా వడ మాలలతో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు బృందావనం పద్మాకర్ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



మామిడికోళ్లలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న నాగేశ్వరరావు, నాయకులు



హోమపూజలు నిర్వహిస్తున్న భక్తులు

గుడ్లవల్లేరు: హనుమత్ జయంతి వేడుకలను మండలంలో వాడవాడలా వైభవంగా నిర్వహించారు. ఆదివారం వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మామిడికోళ్లలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను చిత్తర్వు చేతుల మీదుగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్లూరి మాధవ్, చావా నాగేశ్వరరావు, చుక్కల ఉపేంద్ర, ఐ.మణికంఠ, కొడాలి సుధాకర్, బండ్రెడ్డి బద్రీనాథ్, నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు. గుడ్లవల్లేరు వార్ఫు రోడ్డులో ఆంజనేయ స్వామివారి ఆలయంలో అన్నసమారాధన చేపట్టారు. నెహ్రూ పశువుల సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా పాల్గొన్నారు. రెడ్డిపాలెంలో అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు. గుడ్లవల్లేరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఆంజనేయ స్వామివారికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు.

తోట్లవల్లూరు: హనుమాన్ జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. భద్రిరాజుపాలెం, యాకమూరు, గరికపర్రు గ్రామాల్లో అభయాంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో ఆయా ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం అన్న సమారాధనలు జరిగాయి. భద్రిరాజుపాలెంలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) ప్రతినిధి కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, హైదరాబాద్‌కు చెందిన సుధారెడ్డి, శివకుమారి సహకారంతో అన్నదానం జరిగింది. ఆయా కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.



భద్రిరాజుపాలెంలో పూజలందుకున్న అభయాంజనేయస్వామి

గుడివాడ టౌన్: హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం, పెద్దవీధిలోని కుమ్మరి చెరువు వద్ద శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం, తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు చలమచర్ల మురళీ కృష్ణ మాచార్యులు పర్యవేక్షణలో స్వామి వారికి విశేష అభిషేకాలు, హోమ పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కె.ఆంజనేయ ప్రసాదు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ధార్మిక భావన పెంచుకోవాలి



హనుమాన్ శోభయాత్రను ప్రారంభిస్తున్న బూరగడ్డ శ్రీనాథ్

పామర్రు: ప్రతి ఒక్కరూ ధార్మిక భావనను పెంపొందించుకోవాలని విశ్వహిందూపరిషత్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ అన్నారు. స్థానిక ఉండ్రపూడి వీరాంజనేయస్వామి దేవాలయం వద్ద నుంచి నిర్వహించిన హనుమాన్ శోభయాత్రను ఆయన లాంఛనంగా ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనది హైందవ దేశమని, మన దేశంలో ఇతర దేశాల నాగరికతను ఎక్కువ మంది అలవాటు చేసుకుంటున్నారన్నారు. దీని వలన అహింస, గొడవలు పెరుగుతున్నాయని తెలిపారు. గతంలో ఇటువంటి పరిస్థితి లేదని ఆనాడు అందరూ ప్రశాంతమైన జీవనం గడిపేవారని అన్నారు. యాత్ర ఆలయం వద్ద నుంచి పామర్రులోని శివాలయం, అక్కడినుంచి గుడివాడ రోడ్డులోని పెట్రోల్ బంక్ వరకు నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడు వెన్నా ఉదయ భాస్కరరావు, సభ్యులు పీఎంఎస్ ప్రసాద్, ఆళ్ల రామిరెడ్డి, నిభానుపూడి లక్ష్మణరావు, అరిగెల బాలుడు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ



గుడ్లవల్లేరులో పుస్తక పఠన పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ పద్మజ



మండవల్లి గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు



కలిదిండి గ్రంథాలయంలో యోగా చేస్తున్న బాలబాలికలు

జమీగొల్వేపల్లి(పామర్రు): నీతి కథలను ప్రతి రోజూ తెలుసుకోవడం వలన విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరుగుతుందని గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో వేసవిశిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పంచతంత్ర కథలు, నీతికథలపై అవగాహన కల్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్ కృష్ణ మోహన్, మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి, స్థానికులు ఎంబీ రత్నం, వీ చంద్రశేఖర్ ఆజాద్, విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కై కలూరు: గ్రంథాలయ వేసవి శిక్షణా తరగతులు ఆదివారానికి ఏడో రోజుకు చేరాయి. కలిదిండిశాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగా చేయించారు. అనంతరం బాలబాలికలతో నీతి కథలు చదివించారు. కైకలూరు గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఆర్.రాఘవులు నిర్వహణలో చిన్నారులకు నృత్యంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగిసిన తర్వాత బాలబాలికలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందిస్తామని తెలిపారు.

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో ఆదివారం విజ్ఞాన శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు షేక్ పర్వీన సైంటిస్టులు, డిస్కవరీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాలలో ఉన్న గ్రంథాలను పఠించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుడ్లవల్లేరు: వేసవి సెలవుల్లో బాల బాలికల సందడికి నెలవుగా గ్రంథాలయాలు మారాయని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. ఆదివారం అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన పోటీలు, ఆటల పోటీలను నిర్వహించారు. విజ్ఞాన శిబిరాల పేరుతో వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని బాల బాలికలు చక్కగా వినియోగించుకుంటున్నారని గ్రంథాలయాధికారులు తెలిపారు.

ప్రభుత్వంతో పని చేయించుకోవటం ప్రజల హక్కు

ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

మంత్రిపాలెం(మొవ్వ): ప్రభుత్వంతో పని చేయించుకోవటం ప్రజల హక్కని, ప్రజలకు సేవ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం మంత్రిపాలెం పంచాయతీ పరిధిలోని సూరసానిపల్లిలో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యగా ఉన్న రహదారిని పనులు తక్షణమే ప్రారంభించనున్నామని, రోడ్డు నిర్మాణాన్ని పటిష్టంగా నిర్మించటానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు వెడల్పు చేయాల్సి ఉన్న నేపథ్యంలో ముందుగా రోడ్డు సర్వే నిర్వహించాల్సిందిగా తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్‌ను ఆదేశించారు. ముందుగా రూ.15 లక్షల మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎమ్మెల్యే నిధులతో వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. సుమారు రూ.70 లక్షల నాబార్డ్ నిధులతో రోడ్డు నిర్మాణం నెల రోజుల్లో పూర్తి చేస్తామని హామి ఇచ్చారు. నాబార్డు నిధులతో వేములమడ, మొవ్వపాలెం, కోసూరు–మల్లపల్లి రోడ్డు, కోసూరు చిన ఎస్సీ ఏరియా రోడ్లను త్వరలో ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. సూరసానిపల్లి రహదారి సమస్య తన దృష్టికి తీసుకు రాకపోవటం వలనే ఆలస్యమైందని, దీనిపై ప్రతిపక్ష అనుకూల పత్రికల్లో ఇష్టాను సారంగా రాయటం తగదన్నారు. పర్యటనలో భాగంగా గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పీ కృష్ణ, ఎంపీడీవో జి.సుభాప్రవీణ్, పీఆర్ డీఈ, ఏఈలు టి.శ్రీనివాసరావు, బి.రామారావు, వైఎస్ ఎంపీపీలు డొక్కు వెంకటేశ్వరరావు, కందుల వెంకట కోటేశ్వరరావు (కొండలు), పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైల్డ్‌హుడ్ గ్రూపునకు చెక్కు అందజేత

అవనిగడ్డ: చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌కు కె కొత్తపాలెంకు చెందిన రిటైర్డ్ ఉద్యోగిని మత్తి సీతారామయ్య నెల రోజుల పెన్షన్ రూ.40,800 విరాళంగా అందజేశారు. స్థానిక కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి దివి లీలాకృష్ణకు చెక్కును అందించారు. చైల్డ్‌హుడ్ గ్రూపు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి ఈ మొత్తం అందించామని సీతారామయ్య తెలిపారు. అనంతరం సీతారామయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. అవనిగడ్డ శాఖ అధ్యక్షుడు అలపర్తి గోపాలకృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు యాసం శోభన్‌బాబు, బండే శ్రీను, కమ్మిలి ప్రసాద్, ఘంటా శ్రీనివాస రావు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

కైకలూరు: హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్, కైకలూరు ప్రఖండ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర, భక్తి పూర్వక ర్యాలీ ప్రజల్లో ఆధ్యాత్మికత భావాన్ని నింపింది. వేలాది మంది హిందువులు ర్యాలీలో పాల్గొన్నారు. జై శ్రీరామ్ నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హాజరై బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. మరో ముఖ్యఅతిథి కృష్ణా జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ మాట్లాడుతూ సనాతన ధర్మాలను అందరూ పాటించాలన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి హిందూ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పెద్ద ఎత్తున యువత హాజరయ్యారు. కార్యక్రమంలో కీర్తి వెంకటరామ ప్రసాద్, గురజాడ ఉదయశంకర్, టి.శ్రీనివాసరావు, లావేటి శివాజీ, బీవీ.రావు, డాక్టరు పూర్ణచంద్రరావు, బూరుబోయిన శ్రీనివాసరావు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, రాజరాజేశ్వరి, భాస్కరరావు, పీజేఎస్ మాల్యాద్రి, పెన్మత్స త్రినాథరాజు, తులశి పూర్ణ, సయయం అంజీ, కాట్రగడ్డ నాని, కడిమి శివబాబు, కండబోతు నాగరాజు, చింతల బాబూరావు, బడే బాబు, కొనిజేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నసమారాధనలో ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి మండలం సానారుద్రవరం గ్రామంలో అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో ఎమ్మెల్యే డీఎన్నార్ వడ్డన చేశారు. స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వడ్లాని పార్థసారథి, వడ్లాని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయాల్లో..

కైకలూరు గాంధీబొమ్మ సెంటర్, కోరుకొల్లు రోడ్, వెలంపేట, ఏలూరు రోడ్ ప్రాంతాల్లోని హనుమాన్ దేవాలయాల్లో హనుమద్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. గాంధీబొమ్మ సెంటర్ పూరాతన భక్తంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నసమారాధన జరిగింది.



అభయాంజనేయ స్వామి దేవాలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరు శోభాయాత్రలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

జేవీకే కిట్ల నాణ్యతలో రాజీ వద్దు

పెడన: విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యత విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని, వాటిల్లో ఏమాత్రం తేడా ఉన్నా తక్షణం సంబంధిత యాప్‌లో తెలియ జేయాలని రాష్ట్ర పరిశీలకుడు ఆర్. హైమేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ఎమ్మార్సీలలో జేవీకే స్టాక్ పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హైమేశ్వరరావు ఎంఈఓలకు, సీఆర్పీలకు పలు సూచనలు చేశారు. జేవీకే కిట్లను అందుకున్న వాటిల్లో ఐదు శాతం స్టాకును క్వాలిటీ కంట్రోల్ టీంలోని సభ్యులైన నాడు–నేడు ఏఈ, సెర్ప్ ఏపీఎంలు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఏ మాత్రం నాణ్యతలో తేడా ఉన్నా తక్షణం ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అదే సమయంలో జేవీకే యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పెడన మండలంలో ఎంత మందికి జేవీకే కిట్లను అందించనున్నారనే విషయాలను ఇన్‌చార్జి ఎంఈఓ ప్రసాద్ హైమేశ్వరావుకు వివరించారు. 4,570 మంది కిట్లను అందుకోనున్నారని, స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు ఈ నెల 30వ తేదీ నుంచి సరఫరా చేస్తామని ఎంఈఓ వివరించారు. హైమేశ్వరావు మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు జేవీకే కిట్లను అందించాలన్నారు. సమగ్రశిక్ష జిల్లా సీఎంఓ గోపాలరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ కలయిక



కృత్తివెన్ను: మండల పరిధిలోని సంగమూడి ఉన్నత పాఠశాలలో 2003–04 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను, ఆనాటి స్నేహితులను చూసి ఉద్వేగానికి గురయ్యారు. మిత్రుల క్షేమ సమాచారం తెలుసుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రుక్మానందరెడ్డి, రాధాకృష్ణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతన్నలకు యంత్రాల పంపిణీ



గూడూరు: కలనేత చేనేత సంక్షేమ సంఘం ద్వారా దాతల సహకారంతో కప్పలదొడ్డి గ్రామంలోని చేనేత కార్మికులకు జకాడ్ యంత్రాలను ఆదివారం అందజేశారు. టు మేక్ ఏ డిఫరెన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రశాంతి సౌజన్యంతో ఒక్కొక్కటి రూ.5 వేల విలువ కలిగిన 25 జకార్డు యంత్రాలను గ్రామంలోని నిరుపేద చేనేత కార్మికులకు అందజేశారు. గ్రామంలోని 30 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కలనేత చేనేత సంఘం వ్యవస్థాపకుడు భూసం లోకనాథం, ఫౌండేషన్ సభ్యులు జగదీష్, కలనేత చేనేత సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు భూసం లోకనాథం, జాతీయ క్రీడాకారుడు ప్రభు, గ్రామస్తులు పాల్గొన్నారు.